నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, బుధవారం 7 ఆగస్టు 2024 | VIKARABAD

## 'జయశంకర్ సార్ అడుగుజాడల్లో నడవాలి'



జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ) : ప్రొఫెసర్ జయశంకర్ సార్ అడుగుజాడల్లో నేటి యువత నడవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం జయశంకర్ సార్ 90వ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జయశంకర్ సార్ విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేశారని, ఉద్యమానికి ఊపిరి పోశారని పేర్కొన్నారు. అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఏవో నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## సదరం క్యాంపులకు స్లాట్ బుక్ చేసుకోవాలి

వికారాబాద్, ఆగస్టు 6 : జిల్లాలో దివ్యాంగుల సదరం క్యాంపునకు సంబంధించి బుధవారం ఉదయం 11.00 గంటలకు మీ సేవా కేంద్రాలకు స్లాట్లు ఇవ్వనున్నట్లు వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపులు ఆగస్టు 8వ తేదీ, 16, 22, 29, 31, సెప్టెంబర్ 12వ తేదీ,19, 26, 28, 30 తేదీల్లో తాండూరు ప్రభుత్వ దవాఖానలో నిర్వహించే క్యాంపులకు స్లాట్ బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అంగవైకల్యం, బుద్ధి మాంద్యం, చెవుడు, మూగ ఉన్న వారు హాజరుకావాలని, వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆగస్టు 8వ తేదీ, 14, 20, 22, సెప్టెంబర్ 12వ తేదీ, 17, 19, 24 తేదీల్లో నిర్వహించే క్యాంపులకు అంగవైకల్యం, అంధులు హాజరుకావాలని సూచించారు.

సదరం సర్టిఫికెట్ ఇది వరకు పొంది సర్టిఫికెట్ కాల పరిమితి అయిపోయిన వారితోపాటు కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న వారు హాజరు కావాలని పేర్కొన్నారు. మొత్తం 1320 మందికి ఎస్సేస్‌మెంట్ చేయనున్నట్లు తెలిపారు.

# మాకెప్పుడు మాఫీ!

### అర్హులమైనా రుణమాఫీ కాలేదు



- అర్హులు లక్షల్లో.. మాఫీ వేలల్లోనే..
- జాబితాలో పేరున్నప్పటికీ ఖాతాల్లో జమకాని మాఫీ డబ్బులు
- రెండో విడుతలో 194 మంది రైతుల ఖాతాల్లో జమకాని రూ.1.50 కోట్లు
- మొదటి విడుతదీ ఇదే పరిస్థితి..
- ఇదెక్కడి గందరగోళమని ఆవేదన చెందుతున్న జిల్లా రైతాంగం

రంగారెడ్డి, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రుణమాఫీలో నేటికీ అడుగడుగునా చిక్కులే ఎదురవుతున్నాయి. జిల్లాలో రుణ మాఫీ కోసం లక్షల్లో రైతులు ఎదురు చూస్తుండగా.. కేవలం వేల సంఖ్యలో మాత్రమే ఫలితం దక్కింది. తొలి విడుతలో రూ.లక్షలోపు రుణం తీసుకున్నవారి పేర్లు జాబితాలో కనిపించకపోవడంతో చాలామంది బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇదీ కొనసాగుతుండగానే.. రెండో విడుతలో రూ.లక్షన్నర రుణం ఉన్న రైతులకు మాఫీ చేశారు. ఇందులో కూడా చాలా మందికి మాఫీ కాకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. మాఫీ ప్రక్రియ ఏ ప్రాతిపదికన చేపట్టారో తెలియక చాలామంది రైతులు ఇప్పటికీ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

**ఖాతాల్లో జమకాని రూ.1.50 కోట్ల మాఫీ డబ్బులు..**

రెండు విడుతల తర్వాత కూడా రుణమాఫీకి సంబంధించి సవాలక్ష ప్రశ్నలు ఎదురవుతున్నాయి. వాటికి స్పష్టమైన సమాధానం చెప్పేవారే కరువయ్యారు. ప్రభుత్వం రూపొందించిన ఉత్తర్వుల మేరకు పట్టా పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతుకూ తొలి విడుతలో రూ.లక్ష వరకు, రెండో విడుతలో రూ.లక్షన్నర వరకు మాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కావాలి. కానీ బ్యాంకులు పంపిన జాబితాలో ఉన్న రైతుల్లో చాలామందికి మాఫీ జమకాకపోవడంపై గందరగోళం నెలకొన్నది. ఇందుకు అధికారులు అనేక కారణాలు చెబుతున్నారు. ఖాతాల్లో పేర్లకు, ఆధార్‌కు మధ్య తేడా కారణంగానే మాఫీ డబ్బులు జమకాలేదని అధికారులు చెబుతున్నారు. రేషన్‌కార్డులో పేరులేకపోతే కూడా రుణ మాఫీ డబ్బులు పడలేదు. దీంతో జాబితాలో పేరున్న రైతుల ఖాతాల్లో మాఫీ డబ్బులు జమకాలేదు. మొదటి విడుతలో 1,502 మంది రైతులకు సంబంధించి రూ.28కోట్లకు పైగా మాఫీ డబ్బులు ఖాతాల్లో జమకాలేదు. సంబంధిత రైతుల వివరాలను సేకరించి రాష్ట్ర స్థాయి అధికారులకు పంపించామని జిల్లా అధికారులు చెబుతున్నారు. కానీ ఇప్పటివరకు ఎంత మంది రైతులకు న్యాయం జరిగిందో స్పష్టత లేదు. ఇక రెండో విడుతలోనూ 194 మంది రైతులకు సంబంధించి రూ.1.50 కోట్లు రైతుల ఖాతాల్లో జమకావాల్సి ఉన్నది. వివిధ కారణాలతో జమకాలేదని అధికారులు చెబుతున్నారు. జాబితాలో పేరు వచ్చినప్పటికీ ఖాతాల్లో మాఫీ డబ్బులు జమ కాకపోవడంపై రైతుల్లో ఒకింత ఆందోళన నెలకొన్నది.

**రైతులకు పరిష్కారం కరువు..**

రంగారెడ్డి జిల్లాలో మొదటి విడుతలో 49,700 మంది రైతులకు రూ.258.18 కోట్ల రుణమాఫీ, రెండో విడుతలో 22,915 మంది రైతులకు రూ.218.12 కోట్ల రుణమాఫీ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నది. అయితే అంకెలు మారాయి కానీ మాఫీ విషయంలో మాత్రం అందరి వెతలు ఒకేలా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. రుణమాఫీపై సందేహాల నివృత్తికి కలెక్టరేట్, మండలాల్లోనూ గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశారు. మాఫీ కాకపోవడానికి గల కారణాలను తెలిపేందుకు యాప్‌ను సైతం అందుబాటులోకి తెచ్చారు. అధికారులు సమస్యను నమోదు చేసుకోవడం తప్ప.. పరిష్కారం చూపడం లేదు. దీంతో బాధిత రైతులు నిరాశ చెందుతున్నారు. ఇప్పటికే అధికారులు రుణమాఫీకి సంబంధించి అటు బ్యాంకుల్లో, ఇటు వానాకాలం పంటల పరిశీలన, నమోదు కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో రైతులకు సమాధానాలు చెప్పలేకపోతున్నారు. ఇదిలాఉండగా రుణమాఫీ అయినవాళ్లు మిత్తి పైసలు కట్టేందుకు నానా కష్టాలు పడుతున్నారు. వడ్డీ కడితేనే మాఫీ అని బ్యాంకులు తెగేసి చెప్పడంతో దిక్కులేక కొత్తగా అప్పు తెచ్చి మరీ కడుతున్నారు. దీనిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక.. ఫిర్యాదు చేసినా పరిష్కారం లభిస్తుందన్న నమ్మకం లేక రైతులు అయోమయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

**రుణమాఫీ చేస్తూనే కోతలు విధిస్తున్నది..**



కాంగ్రెస్ ప్రభుత్వం ఓ వైపు రైతులకు రుణాలు మాఫీ చేస్తున్నామని చెబుతూనే మరో వైపు కోతలు విధిస్తున్నది. నేను బ్యాంకులో రూ. 1.43 లక్షల క్రాప్ లోను తీసుకున్నా. ప్రభుత్వం నాకు 1.43 లక్షల రుణమాఫీ చేసినట్లు జాబితాలో పేరు వచ్చింది. కానీ రుణానికి సంబంధించిన వడ్డీ డబ్బులు రూ. 4337లు తిరిగి చెల్లించమని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో నేను ఆ డబ్బులను తిరిగి చెల్లించాను. రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తున్నామని గొప్పలు చెబుతున్న ఈ ప్రభుత్వం వడ్డీల రూపంలో రైతుల వద్ద మళ్లీ డబ్బులు వసూలు చేయడం ఎంతవరకు సమంజసం. ఎంతోమంది రైతులు రుణ మాఫీ విషయంలో ఇబ్బందులు పడుతున్నారు.

– గంగిడి భూపాల్‌రెడ్డి, హైతాబాద్, షాబాద్ మండలం

## శభాష్ పోలీస్ అన్నలు

### డయల్ 100కు గర్భిణి ఫోన్.. సకాలంలో స్పందించిన పోలీసులు

### మానవత్వం చాటుకున్నారని సర్వత్రా హర్షం




మహిళను కాపాడిన పోలీసులు


ఇబ్రహీంపట్నం, ఆగస్టు 6 : ఖాకీల్లో కూడా స్పందించే గుణం ఉన్నదని నిరూపించుకున్నారు... ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని మాడ్గుల పోలీస్ స్టేషన్‌కు చెందిన సిబ్బంది. ఒంటరి మహిళ అర్ధరాత్రి 100 నంబర్‌కు ఫోన్ చేయగా, సమాచారం అందుకున్న మాడ్గుల పోలీసులు వెంటనే స్పందించి ఆపదలో ఉన్న నిండు గర్భిణిని దవాఖానకు తరలించారు. మానవత్వం చాటుకున్న పోలీసులపై ఇబ్రహీంపట్నం డివిజన్‌వాసుల నుంచి అభినందనలు వెల్లివెత్తుతున్నాయి. వివరాల ఇలా ఉన్నాయి.. ఇబ్రహీంపట్నం ఏసీపీ పరిధిలోని మాడ్గుల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి గుర్తుతెలియని ఓ నిండు గర్భిణి తప్పిపోయి వచ్చి మాడ్గుల పోలీస్ స్టేషన్ పరిధిలో పోలెపల్లి వద్ద ఉండి తనకు పురిటి నొప్పులు వస్తున్నట్లు 100 నంబర్‌కు ఫోన్ చేసింది. వెంటనే ఈ విషయాన్ని 100 నంబర్ సిబ్బంది మాడ్గుల పోలీసులకు చేరవేశారు. అప్పటికే డ్యూటీలో ఉన్న పోలీసులు రాజేందర్, సురేశ్‌లు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారు మాడ్గుల రైతు వేదిక వద్దకు వెళ్లగా అక్కడ నిండు గర్భిణి ఇద్దరు పిల్లలతో ఉన్నది. ఆమెకు తెలుగు రాకపోవడంతో ఏమి అడిగినా సమాధానం చెప్పలేదు. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లి ఆమెను విచారించగా ఆమె పేరు కమీభాయ్ మహారాష్ట్రలోని చించోలి తాలూకాకు చెందిన వాసిగా తెలిపింది. వారం రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చానని తన భర్త పేరు గిరీశ్ అని తెలిపింది. అలాగే, భర్త ఫోన్ నంబర్ చెప్పగా ఆ నంబర్‌కు పోలీసులు ఫోన్ చేయడంతో తమ గ్రామానికి చెందిన వ్యక్తే అని చెప్పారు. జూలై 29న ఈ మహిళా తప్పిపోయినట్లు చించోలీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయం ఆధారంగా ఆమె తమ్ముడు హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలుసుకుని పోలీసులు అతడికి ఫోన్ చేశారు. మహిళకు అప్పటికే పురిటి నొప్పులు వస్తుండడంతో చుట్టుపక్కల ఉన్న మహిళలను తోడుగా ఉండమని పోలీసులు కోరారు. దీంతో మహిళల సాయంతో పురుడు పోయించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. విషయం తెలుసుకున్న సీఐ నర్సింహారావు దవాఖానకు వెళ్లి మహిళ ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు మాడ్గుల పోలీసులను అభినందించారు.



మహారాష్ట్రకు చెందిన కమీభాయ్‌ను పరామర్శిస్తున్న సీఐ నర్సింహారావు

## క్లెయిమ్ చేయని వాహనాల బహిరంగ వేలం

### ప్రభుత్వానికి రూ. 91.43 లక్షల ఆదాయం



సిటీబ్యూరో, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): వివిధ కారణాలతో నగర పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలను ఆయా యజమానులు స్వాధీనం చేసుకోకపోవడంతో గోషామహల్ స్టేడియంలో మంగళవారం కార్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షితాకృష్ణమూర్తి నేతృత్వంలో బహిరంగ వేలం వేశారు. 1161 వాహనాలను వేలం వేయగా.. అందులో 500 మంది బిడ్డర్స్‌లు పాల్గొని 1093 వాహనాలను దక్కించుకున్నారు. ఇందులో 1072 ద్విచక్ర, 16 త్రిచక్ర, ఐదు నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయని, ఈ వేలంలో రూ. 80.35 లక్షలు, అలాగే, 68 వాహనాలు స్క్రాప్ కండిషన్‌లో ఉన్నాయని, వాటిని విక్రయించగా రూ. 11,08,500 వచ్చినట్లు వెల్లడించారు. ఈ వేలంలో రూ. 91,43,500 ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీలో డిపాజిట్ చేసినట్లు తెలిపారు.

# కూలీ డబ్బులు రాలే




- 'ఉపాధి' కూలీలకు మూడు నెలలుగా అందని డబ్బులు
- పెండింగ్‌లో రూ.58.62 కోట్లు
- మే నెల నుంచి వేతనం అందక కూలీల ఇబ్బందులు
- ఉపాధి హామీ పథకంపై కేంద్రం నిర్లక్ష్య వైఖరి
- గత మూడేండ్లలో తగ్గించిన 44 లక్షల పనిదినాలు
- జిల్లావ్యాప్తంగా 1.85 లక్షల జాబ్‌కార్డులు..
- 3.79 లక్షల మంది కూలీలు

వికారాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నది. గత రెండేండ్లుగా ఉపాధి హామీ పథకంలో గతంలో ఎన్నడూలేని కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ప్రభుత్వ సంస్థలన్నింటినీ అదానీ వంటి పెట్టుబడుదారులకు అప్పగించేలా మోదీ ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తున్నది. కరువును అధిగమించేందుకు తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకానికి మాత్రం తూట్లు పొడుస్తున్నది. గత ఆర్థిక సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాలతో కూలీలకు ఉపాధి హామీ పనులు దూరమయ్యాయి. ఉపాధి హామీ పనులను భారీగా తగ్గించిన కేంద్రం వేల కూలీల కుటుంబాల కడుపు కొడుతున్నది. ఎన్నో కుటుంబాలను ఉపాధి హామీ పనులకు కేంద్ర ప్రభుత్వం దూరం చేసింది. రోజువారీ కూలీ డబ్బులు అందక పలువురు కూలీలు ఉపవాసం ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. గత మూడు నెలలుగా కూలీ డబ్బులు అందలేదు. మే నెల నుంచి కూలీ డబ్బులు పెండింగ్‌లో ఉండడం బాధాకరం. గత మూడు నెలలకుగాను రూ.58.62 కోట్ల కూలీ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉపాధి హామీకి నిధులు విడుదల చేస్తున్నదన్న ఆశతో ఉన్న కూలీలను కేంద్ర ప్రభుత్వం నట్టేటముంచింది. ఈ ఆర్థిక సంవత్సరం 59.85 లక్షల పని దినాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 57.53 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. మరోవైపు జిల్లావ్యాప్తంగా 1,85,107 జాబ్ కార్డులుండగా, 3,79,869 మంది కూలీలు ఉన్నారు. 1,31,603 మంది యాక్టివ్ కూలీలు ఉన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.300 చెల్లిస్తున్నారు.

**మూడేండ్లలో 44 లక్షల పనిదినాలు తగ్గింపు..**

పేదలకు ఉపాధి హామీ పనులను దూరం చేసే విధంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. లక్షల మంది పేద కుటుంబాల కడుపు నింపుతున్న ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నీరుగార్చి పథకాన్ని నిలిపివేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగానే తప్పుడు నివేదికలు తెప్పించుకొని అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయంటూ ప్రచారం చేసి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నది. అందుకు అనుగుణంగానే గత రెండేండ్లుగా ఉపాధి హామీ పని దినాలను భారీగా తగ్గించింది. కేవలం మూడేండ్లలోనే 44 లక్షల పని దినాలను జిల్లాలో తగ్గించారంటే ఉపాధి హామీ పథకంపై మోదీ ప్రభుత్వం ఏ స్థాయిలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదో అర్థం చేసుకోవచ్చు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో 1.03 లక్షల పనిదినాలను కల్పించగా, 2022–23 ఆర్థిక సంవత్సరంలో 31.41 లక్షల పనిదినాలను తగ్గిస్తూ 71.58 లక్షల పనిదినాలను కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తదనంతరం 2023–24 ఆర్థిక సంవత్సరంలో మరో 10 లక్షల మేర పనిదినాలను తగ్గిస్తూ 62 లక్షల పనిదినాలను కల్పించాలని నిర్ణయించింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మరో 2.98 లక్షల పనిదినాలను తగ్గిస్తూ 59.85 లక్షల పనిదినాలుగా నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఎన్ఆర్ఈజీఎస్ సాఫ్ట్–ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌తో జిల్లాలోని లక్షల కుటుంబాలకు ఉపాధి హామీ పనులు దూరమయ్యాయి. కొత్త సాఫ్ట్‌వేర్ విధానంతో కూలీలు తప్పనిసరిగా ఉదయం, సాయంత్రం పనులకు తప్పనిసరిగా హాజరుకావాలని షరతులను విధించింది. కూలీలు చేస్తున్న పనులకు సంబంధించి ఉదయం 11 గంటల్లోపు ఒక ఫొటో, సాయంత్రం 2 గంటల తర్వాత రెండో ఫొటో తప్పనిసరిగా తీయడంతో పాటు అప్‌లోడ్ చేస్తున్నారు. ఒక గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులకు సంబంధించి ఒక పని పూర్తైన తర్వాతనే మరొక పని చేపట్టాలని నిబంధన విధించారు. దీంతో గతంలో మాదిరిగా కాకుండా పనులు చాలా ఆలస్యమవుతున్నాయి. నిత్యం చేపడుతున్న పనులను వెంటనే యాప్‌లో పొందుపర్చాలనే నిబంధనలతో క్షేత్రస్థాయిలో సిగ్నల్ లేకపోవడంతో అప్‌లోడ్ చేయడం ఇబ్బందిగా మారి పనుల్లో కూడా జాప్యం జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రతి కుటుంబానికీ వంద రోజుల పనిని కల్పించడమే లక్ష్యంగా పని చేస్తుంటే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో ఈ ఆర్థిక సంవత్సరం వేల కుటుంబాలకు ఉపాధి హామీ పనులు దూరమయ్యాయి. వికారాబాద్ జిల్లావ్యాప్తంగా రెండేండ్ల కింద 19,998 కుటుంబాలకు వంద రోజులపాటు పనులను కల్పించగా, గత ఆర్థిక సంవత్సరం కేవలం 9200 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పనులను కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరం 2948 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పనిని కల్పించడం విడ్డూరం.


**రెండు నెలలైనా డబ్బులు రాలేదు..**



రెండు నెలల కిందట ఉపాధి హామీ పనులకు వెళ్లాం. అడవిలో నీటి నిల్వ కోసం, మొక్కలు నాటడానికి, చెరువులో ఒండ్రుమట్టి తొలగించే పనులు చేశాం. ఇంత వరకు కూలీ డబ్బులు రాలేదు. అధికారులను అడిగితే వస్తే ఖాతాలో జమ చేస్తామని చెబుతున్నారు. రోజూ కూలీ పనులు చేసుకుంటేనే కాలం గడుస్తున్నది. చేసిన పనికి నెలలకొద్దీ కూలీ రాకుంటే ఎలా బతకాలి.

– పల్లె రాంరెడ్డి, బొంరాస్‌పేట

**వారానికోసారి ఇస్తే బాగుంటుంది..**



ఉపాధి హామీ పనులు చేస్తే కూలీ తొందరగా ఇవ్వడం లేదు. పేద కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల కిందట ఉపాధి హామీ పనులకు వెళ్లా. నాలుగు వారాల కూలీ రావాలి. ఎప్పుడు అడిగినా త్వరలోనే వస్తుందని చెబుతున్నారు. చేసిన పనికి వారం రోజులకు ఒకసారి అయినా కూలీ ఇస్తే బాగుంటుంది. నెలల పాటు కూలీ రాకుంటే ఎట్లా గడపాలి.

– తుల్జానాయక్, గాజులకుంట తండా